
ప్రజాశక్తి

బుధవారం జూన్ 5 2024 8 పేజీలు


శ్రీకాకుళం





కూటమి క్లీన్‌స్వీప్

- శ్రీకాకుళం ఎంపీ సహా ఎనిమిది అసెంబ్లీ స్థానాలూ కైవసం
- ఏడు అసెంబ్లీ స్థానాల్లో టిడిపి, ఎచ్చెర్లలో బిజెపి విజయం



ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

- 3,14,107 ఓట్ల మెజార్టీతో ఎంపీ రామ్మోహన్ నాయుడు హ్యాట్రిక్ విజయం
- జిల్లాలో తుడుచుపెట్టుకుపోయిన వైసిపి
- ఓటమిపాలైన శాసనసభ స్పీకర్ తమ్మినేని
- అదే బాటలో మంత్రులు ధర్మాన, సీదిరి
- అధికార పార్టీకి ఊహించని పరాభవం




సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో జిల్లాలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభంజనం సృష్టించింది. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం సహా ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలనూ కైవసం చేసుకుని క్లీన్‌స్వీప్ చేసింది. ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచి కూటమి అభ్యర్థుల పైచేయి కనిపించింది. తొలి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు అదే ఆధిక్యత కనిపించింది. జిల్లాలో ఏకంగా ఎనిమిది సీట్లలోనూ ఆధిక్యతను కనబరిచి, అధికార పార్టీని హడలెత్తించింది. కూటమి హవాకు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంతో సహా రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఓటమి పాలయ్యారు. ఊహకందని స్థాయిలో ఫలితాలు రావడంతో వైసిపి శ్రేణులు షాక్‌కు గురయ్యాయి. ఊహించని పరాభవంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనయ్యారు. మరోవైపు టిడిపి ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో విజయోత్సాహం ఉరకలు వేస్తోంది.

వార్త... 2లో


బెందాళం అశోక్


గౌతు శిరీష


అచ్చెన్నాయుడు


రమణమూర్తి


గొండు శంకర్


రవికుమార్


గోవిందరావు


ఈశ్వరరావు

ఉత్కంఠగా కౌంటింగ్

- ఫలితాల కోసం జనం ఆరా
- కౌంటింగ్‌ను పరిశీలించిన అధికారులు
- పోలీసుల పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-ఆమదాలవలస

కౌంటింగ్ ప్రక్రియ ఉత్కంఠ వాతావరణలో సాగింది. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు లెక్కింపు ప్రారంభం కావాల్సి ఉన్నా కొంత జాప్యం చోటు చేసుకుంది. పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు ఆలస్యం కావడంతో మొదటి ఫలితం తెలియడానికి సుమారు అరగంటపైన పట్టింది.రాష్ట్ర వ్యాప్తంగా మొదటి, రెండో రౌండ్ లెక్కింపు ఫలితాలు వస్తున్నా జిల్లాలో ఫలితాలు అందలేదు. ఉదయం పది గంటల తర్వాత లెక్కింపు వేగం పుంజుకుంది. తొలి ఫలితం శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి వెలువడింది. చివరిగా ఇచ్ఛాపురం రిజల్ట్ వచ్చింది. జిల్లాలో తొలి రౌండ్ ఫలితం 9.15 గంటలకు ఆమదాలవలస అభ్యర్థి కూన రవికుమార్ 2,220 ఆధిక్యం సాధించి బోణి కొట్టారు. తర్వాత ఒక్కొక్కటి ఫలితాలు రావడం ప్రారంభించాయి. ప్రతి రౌండులోనూ టిడిపి అభ్యర్థుల ఆధిక్యం కనబరచడం, అంతకంతకూ భారీ వ్యత్యాసం ఏర్పడటంతో వైసిపి అభ్యర్థులు ఒక్కొక్కరుగా కౌంటింగ్ కేంద్రం నుంచి వెనుదిరిగారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఫలితాలు ఏకపక్షంగా వస్తుండటంతో కొంత మంది ఏజెంట్లు సైతం బయటకు వెళ్లిపోయారు


పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది

ఫలితాలపై జనం ఆరా

గెలుపోటములపై పలు సర్వే సంస్థల సర్వేలు వేర్వేరుగా ఉండటంతో కౌంటింగ్ రోజు ఏం జరుగుతుందా అని అంతా తీవ్ర ఉత్కంఠ లోనయ్యారు. టిడిపి వస్తుందా లేక వైసిపి మళ్లీ అధికారం చేపడుతుందా అనే చర్చ మంగళవారం ఉదయమూ సాగింది. జిల్లాలో ఎవరెవరు గెలుస్తారని తెలుసుకునేందుకు ఉదయం ఎనిమిది గంటలు ఎప్పుడు అవుతుందా అని ఉత్కంఠగా ఎదురుచూశారు. అంతా టీవీలకు అతుక్కుపోయారు. మరోవైపు కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లిన తమ వారిని ఫోన్లలో అడిగి తెలుసుకున్నారు. మన అభ్యర్థి పరిస్థితి ఏమిటని ఆరా తీశారు. మరికొందరు మొబైల్ ఫోన్లలో ఫలితాలను వీక్షించారు. ఫలితాల తర్వాత వైసిపి ఓటమిపై అంతటా చర్చ జరిగింది. ఇంత ఘోరంగా ఓడిపోతుందనుకోలేదంటూ మాట్లాడుకున్నారు.


సీల్‌ను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు బాబు

ప్రశాంతంగా కౌంటింగ్

ఓట్ల లెక్కింపు అంతా ప్రశాంతంగా సాగింది. ఓట్ల లెక్కింపు జరుగుతున్న తీరును జిల్లా ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ పరిశీలించారు.కౌంటింగ్ కోసం ఎన్నికల సంఘం ఎనిమిది నియోజకవర్గాలకు నియమించిన ప్రత్యేక అధికారులు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షించారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల లోపలికి ప్రవేశించే వారిని తనిఖీలు చేశారు. సెల్ ఫోన్లను కేంద్రాల్లోకి అనుమతించలేదు. కౌంటింగ్ కేంద్రం సమీపంలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టిన తర్వాతే కేంద్రాల్లోకి విడిచిపెట్టారు. ఎస్‌పి జిఆర్ రాధిక బందోబస్తు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.


ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్



పకడ్బందీ బందోబస్తు

విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని

శ్రీకాకుళం : ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీగా బందోబస్తు విధులు నిర్వహించాలని విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికల ఓట్లకౌంటింగ్ సరళిని, బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం సందర్శించి పర్యవేక్షించారు. కౌంటింగ్ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ కేంద్రాల లోపల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. కౌంటింగ్ కేంద్రాల్లో ప్రతి పాయింట్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్‌పి జి.ఆర్ రాధిక, ఎఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్ ఉన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తా : ధర్మాన

శ్రీకాకుళం అర్బన్ : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నానని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు చెప్పినట్టుగానే అందరితో స్నేహితునిగానే కొనసాగుతానని తెలిపారు. సుదీర్ఘకాలం ప్రజాప్రతినిధిగా సేవలందించడానికి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు ధీటుగా శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేయడానికి కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. తాను విజయం సాధించాలని పనిచేసిన వైసిపి నాయకులు, కార్యకర్తలకు, తనకు ఓట్లు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏర్పడుతున్న ప్రభుత్వాలు ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికి అవసరమైన పరిపాలనా పద్ధతులను, విధానాలను రూపొందించి వాటిని అమలు చేసే ధ్యేయంతో పనిచేస్తాయని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

కూటమి క్లీన్‌స్వీప్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లు, సర్వీస్ ఓట్లు తర్వాత ఇవిఎంల్లోని ఓట్లను లెక్కించారు. తొలి రౌండ్ ఫలితాలు సుమారు 9.30 గంటల ప్రాంతంలో వెలువడ్డాయి. ఎంపీ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు, ఎచ్చెర్లలో మిత్రపక్షమైన బిజెపి అభ్యర్థి ఆధిక్యత కనబరిచారు. ఓట్ల లెక్కింపు చివరి రౌండ్ వరకు ఇదే ఒరవడి కొనసాగింది. ఒక్క నియోజకవర్గంలోనూ వైసిపి పోటీ ఇవ్వలేకపోయింది. సమయం గడిచిన కొద్దీ ఆధిక్యత పెరుగుతూనే ఉంది. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి తొలి ఫలితం విడుదలైంది. వెనువెంటనే ఆమదావలస ఫలితం వెల్లడైంది. ఆ తర్వాత ఒక్కొక్కటిగా ఫలితాలు వెల్లడవుతూ వచ్చాయి. రాత్రి ఎనిమిది గంటలకు శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు అన్ని అసెంబ్లీ స్థానాల ఫలితాలూ వచ్చాయి. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించారు. టిడిపి తరుపున విజయం సాధించిన వారిలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు (టెక్కలి), బెందాళం అశోక్ (ఇచ్ఛాపురం), గౌతు శిరీష (పలాస), బగ్గు రమణమూర్తి (నరసన్నపేట), గొండు శంకర్ (శ్రీకాకుళం), కూన రవికుమార్ (ఆమదాలవలస), మామిడి గోవిందరావు (పాతపట్నం) ఉన్నారు. కూటమి మిత్రపక్షమైన ఎచ్చెర్ల బిజెపి అభ్యర్థి ఎన్.ఈశ్వరరావు విజయం సాధించారు. శ్రీకాకుళం ఎంపీ స్థానం నుంచి రామ్మోహన్ నాయుడు 3,14,107 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు.

హ్యాట్రిక్ సాధించిన ఇద్దరు ఎమ్మెల్యేలు

టిడిపి నుంచి గెలుపొందిన ఇద్దరు వరుసగా మూడు పర్యాయాలు గెలిచి హ్యాట్రిక్ సాధించారు. టెక్కలి నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం నుంచి బెందాళం అశోక్ 2014, 2019 ఎన్నికలతో పాటు ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లోనూ విజయం సాధించారు. అశోక్‌కు 1,06,596 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి పిరియా విజయకు 68,973 ఓట్లు పోలయ్యాయి. 37,623 ఓట్ల మెజార్టీతో అశోక్ గెలుపొందారు. అచ్చెన్నాయుడుకు 1,07,923 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌కు 73,488 ఓట్లు పోలయ్యాయి. 34,435 ఓట్ల మెజార్టీతో అచ్చెన్నాయుడు విజయం సాధించారు.

రామ్మోహన్ నాయుడు హ్యాట్రిక్

శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు వరుసగా మూడుసార్లు గెలుపొందారు. 2014 ఎన్నికల్లో వైసిపి తరుపున పోటీ చేసిన రెడ్డి శాంతిని 1,27,692 ఓట్ల తేడాతో ఓడించారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై 6,653 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి పేరాడ తిలక్‌పై 3,14,107 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి మెజార్టీలో రికార్డు సృష్టించారు. రామ్మోహన్‌నాయుడుతో మూడుసార్లు ముగ్గురు వేర్వేరు వైసిపి అభ్యర్థులు తలపడడం గమనార్హం.


అచ్చెన్నాయుడును ఆలింగనం చేసుకుంటున్న రామ్మోహన్ నాయుడు

పరాజయం పాలైన వైసిపి ముఖ్య నేతలు

ఫలితాల్లో వైసిపి ముఖ్య నేతలు ఘోర పరాజయాన్ని చవిచూశారు. శాసనసభ స్పీకర్, ఆమదాలవలస అభ్యర్థి తమ్మినేని సీతారాం టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ చేతిలో 33,183 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి గొండు శంకర్, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును 52,521 ఓట్ల భారీ మెజార్టీతో ఓడించారు. మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, టిడిపి అభ్యర్థి గౌతు శిరీష చేతిలో 40,350 ఓట్ల వ్యత్యాసంతో ఓడిపోయారు.

గొండు శంకర్‌కు అత్యధిక మెజార్టీ



శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన గొండు శంకర్‌కు రికార్డు స్థాయిలో మెజార్టీ దక్కింది. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయం సాధించిన కూటమి అభ్యర్థుల్లో శంకర్ మొదటి స్థానంలో నిలిచారు. వైసిపి తరుపున పోటీ చేసిన రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసారావుపై 52,521 ఓట్ల భారీ తేడాతో గెలుపొందారు.



కార్యకర్తలతో అచ్చెన్నాయుడు

అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కూటమి విజయానికి సహకరించిన కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో విజయోత్సవాలు నిర్వహించి మిఠాయిలను పంచుకున్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, పూజారి శైలజ, గొండు లక్ష్మణరావు, కర్రి అప్పారావు, ఎస్.శ్రీనివాస్, సునీల్ పాల్గొన్నారు.



నాయకులతో రమణమూర్తి

రమణమూర్తికి పట్టం కట్టారు

ప్రజాశక్తి- పోలాకి

టిడిపి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి మంగళవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో మళ్లీ పట్టం కట్టారు. ఈ సందర్భంగా నరసన్నపేట టిడిపి కార్యాలయంలో కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ముందుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈయన స్వగ్రామం జలుమూరు మండలం మర్రివలసలో 1958లో జన్మించారు. ఈయన చిన్న నాటి నుంచి రాజకీయాలు అంటే చురుకుగా పాల్గొనే వారు. 1983లో ఎన్‌టిఆర్ స్థాపించిన టిడిపిలో చేరారు. 2014లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో ధర్మాన కృష్ణదాస్ చేతిలో ఓటమి పాలయ్యారు. పోలాకి మండల టిడిపి అధ్యక్షులు ఎం.వెంకటఅప్పలనాయుడు, రైతు విభాగం అధ్యక్షుడు ఎల్.రాంబాబు, గాతలవలస సర్పంచ్ మెండ శ్రీనివాసరావు, ఎంపిటిసి వై.లక్ష్మణరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొండు రామన్న, ఎంపిటిసి ప్రతినిధి గొండు మురళి, డోల ప్రసాదరావు, బైరి భాస్కరరావు, చిట్టి సింహాచలం, దంత సింహాచలం, లావేటి కృష్ణారావు అభినందించారు.

అచ్చెన్నాయుడు హ్యాట్రిక్

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ఎమ్మెల్యేగా వరుసగా మూడోసారి కింజరాపు ఆచ్చెన్నాయుడు విజయంతో హ్యాట్రిక్ సాధించారు. టెక్కలి నియోజకవర్గ ప్రజానీకానికి చేసిన అభివృద్ధే ఆయనకు వరుసగా మూడోసారి పట్టం కట్టేందుకు కొలమానంగా మారింది. 2019లో సమీప వైసిపి ప్రత్యర్థి పేరాడ తిలక్‌పై పోటీ చేసి 87,658 ఓట్లు సంపాదించుకుని, 8545 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో సమీప వైసిపి ప్రత్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌పై పోటీ చేసి 81,164 ఓట్లు సంపాదించుకుని, 8,387 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, రైతుబజారు, చిన్నబజారులో వ్యాపార దుకాన సముదా యాల నిర్మాణం, హుదూద్ ఇళ్ల నిర్మాణం, కోర్టు భవనాలు నిర్మాణానికి నిధులు మంజూరు వంటి అభివృద్ధి చేశారు. వ్యవసాయంపైనే ఆధారపడే రైతాంగానికి అండగా చిన్నసాన, సన్యాసి నీలాపురం గ్రామాల వద్ద నిర్మాణం చేపట్టిన ఎత్తిపొతల పథకం వంటి పనులే కింజరాపు విజయానికి దోహదపడ్డాయని చెప్పుకోవచ్చు. మంత్రిగా అచ్చెన్న ఉన్న సమయంలో అవినీతికి పాల్పడ్డారనే అభియోగంపై కేసు నమోదు చేసి దౌర్జన్యంగా ఇంటి నుంచి తీసుకెళ్లిన వంటి ఘటనలను టెక్కలి ప్రజలు జీర్ణించుకోలేక పోయారు. ఇటువంటి తరుణంలో కింజరాపు అచ్చెన్న విజయం భారీ మెజార్టీ సాధనకు టెక్కలి వైసిపి నాయకునిగా దువ్వాడ శ్రీనివాస్ చేసిన కవ్వింపు చర్యలూ ఆయన విజయానికి కారణాలని చెప్పవచ్చు. ఇలా అచ్చెన్న విజయానికి అనేక కారణాలు చెప్పొచ్చు.



అచ్చెన్నాయుడు

గ్రంథాలయంలో వేసవి శిబిరాలు



నౌపడ : పత్రికా పఠనం చేయిస్తున్న రూపావతి



మెళియాపుట్టి : పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి అనురాధ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జూన్ 6 వరకు నిర్వహించి ఏడవ తేదీన విజేతలకు బహుమతులు ప్రధానం చేయనున్నామని స్థానిక గ్రంథాలయ అధికారి అనురాధ తెలిపారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నౌపడ: పత్రికా పఠనంతో విద్యార్థులకు విజ్ఞానం కలుగుతుందని నవకోట శాఖా గ్రంథాలయాధికారి రూపావతి అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పత్రిక పఠనం చేయించారు. అనంతరం కుర్చీలాట ఆడించారు. కార్యక్రమంలో హెల్పర్ ప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.

అప్పలరాజు ఓటమికి ఆ నలుగురే..!

పలాస : మంత్రి అప్పలరాజు ఓటమికి మంత్రి అనుచరులుగా ఉన్న ఆ నలుగురే కారణమని చర్చ జరుగుతుంది. ఆ నలుగురు కారణంగా వైసిపిలో మొదటి నుంచీ జెండా పట్టుకొని తిరిగిన వారు బయటకు వెళ్లడానికి కారణమని, బయటకు వెళ్లిన వైసిపి పాత నాయకులే మంత్రి ఓటమికి తీవ్ర కృషి చేయడమే ప్రధాన కారణని తెలుస్తుంది. ఇక మంత్రి అనుచరులు ఆక్రమణలు కక్షసాధింపు చర్యలు చేపడుతున్న వారిని మంత్రి వారించకపోవడంతో వారు మరింత రెచ్చిపోవడంతో ఓటమికి ఒక కారణమని చెప్పుకుంటున్నారు. గత ఎన్నికల్లో మంత్రి సీదిరి అప్పలరాజు వెంట మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు వరిశ హరిప్రసాద్, మాజీ ఎంపిపి ప్రతినిధి కొర్ల కన్నారావు, వైసిపి పట్టణ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేంబాబు చౌదరి, మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ప్రతినిధి కోత్లా దుర్గాప్రసాద్, జుత్తు నీలకంఠం, మాజీ ఎంపిపి కొయ్య శ్రీనివాస్‌రెడ్డి... ఇలా పదుల సంఖ్యలో వైసిపి నాయకులు శ్రమించి మంత్రి సీదిరి అప్పలరాజు గెలుపుకు కృషి చేశారు. మంత్రి ఎన్నికల ఏడాది ముందు నుంచి ప్రవర్తనలో మార్పురావడం, నాయకులు. కార్యకర్తలు మాటను పెడచెవిన పెట్టడం కూడా ఒక కారణమని తెలుస్తుంది.

'దువ్వాడ'కు పరాభవం

టెక్కలి: టెక్కలి నియోజకవర్గ వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌కి ఇంటా, బయటా పరాభవమే ఎదురైంది. హరిశ్చంద్రపురం నియోజకవర్గం నుంచి కింజరాపు అచ్చెన్నాయుడుపై పోటీ చేస్తున్న దువ్వాడకి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా లేకపోవడం గమనార్హం. ఎమ్మెల్సీగా దువ్వాడ శ్రీనివాస్ అచ్చెన్నాయుడుపై వరుసగా ఓటమి పాలయ్యారు. విజయానికి గల కారణాలను దువ్వాడ అన్వేషించడంలో వైఫల్యం చెందారని పలువురు వాపోతున్నారు. రిగ్గింగ్‌పైనే అచ్చెన్నాయుడు విజయం సాధిస్తున్నారని దువ్వాడ చేస్తున్న ఆరోపణలు నేపథ్యంలో ఈసారి టెక్కలి నియోజకవర్గంలో దువ్వాడ ఎన్నికల కమిషన్‌కి చేసిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ బూత్‌ల్లో పటిష్ట చర్యలు చేపట్టారు. అయినా విజయం సాధించకపోవడం గమనార్హం. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభంజనంలోనే అపజయం పాలైన దువ్వాడ ఈసారి ఎన్నికల్లో కూడా గుణపాఠం నేర్చుకోకపోవడం గమనించదగ్గ విషయం. దువ్వాడ నియంతృత్వ పోకడల వల్ల తన వెనుక ఉన్న కేడర్ బలహీనపడడం, కార్యకర్తలను, కేడర్‌ని పట్టించుకోకపోవడం, సరైన నాయకత్వ లక్షణాలు లేకపోవడం వంటి కారణాలు ఉన్నాయి. మరో వైపు కుటుంబ కలహాల నేపథ్యంలో దువ్వాడ వ్యక్తిగత ఇమేజ్‌కి భంగం కలగడం వంటివి అపజయానికి కారణాలుగా భావిస్తున్నారు.

చురుగ్గా రోడ్డు పనులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండి- బెండి గేట్ రహదారి పనులకు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. మాజీ మంత్రి అప్పలరాజు కార్యాలయం హై ఇంపాక్ట్ నిధులు రూ.2.90 కోట్లు వెచ్చించి పనులు చేపడుతున్నారు. పాత టెక్కలి నుంచి బిండుగేటు కూడలి వరకు రోడ్లు పనులు జరుగుతాయని ఆర్అండ్‌బి అధికారులు తెలిపారు. పూర్తిగా పాడై గోతులు మాయమైన ప్రాంతంలో రోడ్డును వెట్ మిక్స్‌తో ఎత్తి చేసి దానిపై బిటి రహదారి నిర్మిస్తున్నారు. నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా రహదారి పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈసారైనా పని మధ్యలో ఆపకుండా పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చేపడుతున్న తారు రోడ్డు పనులు

ఉద్దానం పనసకు భలే గిరాకీ

- ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- కిలో రూ.20
- రోజుకు 50 టన్నుల ఎగుమతి



ప్రజాశక్తి- పలాస

ఉదాన ప్రాంతం అంటే దేశంలో ఎవరికైనా గుర్తొచ్చేది ఉద్యమాలు. అటువంటి ఉద్యమాల ప్రాంతంలో జీడి, కొబ్బరి పంటలతో పాటు అంతర పంటగా పనస పండిస్తూంటారు. అటువంటి ఉదానంలో పండిన పనస పంట నేడు ఇతర దేశాలకు పెద్ద ఎత్తున విక్రయాలను పలాస కేంద్రంగా జరగడం విశేషం. ఇతర ప్రాంతాల్లో లభ్యమయ్యే పనస కంటే ఉదానంలో పండే పనస ఎక్కువ రుచిగా ఉండడంతో ఈ ప్రాంతంలోని పనస ఇతర ప్రాంతాలలో ఎక్కువుగా డిమాండ్ ఉంది. ప్రస్తుతం పనస కాయలు పంట సీజన్ ప్రారంభం కావడంతో ఉద్యానం పనస పలాస, కవిటి, కంచిలి. ఇచ్ఛాపురం, హరిపురం, సొంపేట కేంద్రాలుగా ఇతర రాష్ట్రాలకు లారీల్లో జోరుగా ఎగుమతులు జోరందుకున్నాయి. ఇక ధర విషయానికి వస్తే కాయలు సైజును బట్టి రూ.18 నుంచి రూ.20 వరకు కిలో ధరగా పలుకుతుంది. ఇక ఎగుమతులు విషయానికి వస్తే పలాస కేంద్రంగానే రోజుకు 20 టన్నుల పనస కాయలు ఎగుమతి అవుతుండగా, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, హరిపురం, సొంపేట కేంద్రాలుగా మరో 30 టన్నులు మొత్తం రోజుకు 50 టన్నుల వరకు లారీల ద్వారా ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అవుతుండడం విశేషం. మార్చి నెల నుంచి మే నెల చివరి వరకు పనస కాయలు ఎగుమతులు జరుగుతుంటాయి. అయితే పనస మొక్కలను వివిధ రకాల పురుగుల మందులు, ఎరువులు వేసి పండించిన పంట చేతికి వచ్చినప్పటికీ ధర మాత్రం గిట్టుబాటు రావడం లేదని, ధరను పెంపుచేసే చర్యలను ప్రభుత్వం చేపట్టాలని రైతాంగం కోరుతున్నారు.

ఉద్దానంలో పండే పనసకు కలకత్తా, బరంపురం, గుజరాత్, బీహార్ వంటి ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉన్నట్లు తెలుస్తుంది. ఆయా ప్రాంతాల్లో పచ్చళ్లు, పకోడి, రసం వంటి తయారు చేయడానికే కాకుండా పనస ముక్కల బిర్యాని, పనస పొట్టు కూర, పనసపండు వాల్వా, పనస గింజలు కూర, పనస ముక్కల గూనచారు, పనసకాయ కుర్మా వంటి వంటకాలను తయారీ చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో పనస కాయలకు ఎక్కువుగా వినియోగం ఉండడంతో వ్యాపారులు ఇతర ప్రాంతాలను ఎగుమతి చేస్తుంటారు.

ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలి

పనసకాయలు దిగుబడి ఆశించిన మేరకు లభ్యమవుతుంది. దానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. పనస కాయలు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్న మధ్యవర్తులు అడిగినంత ధరకు ఇవ్వక తప్పడం లేదని, అందువల్ల రైతు భరోసా కేంద్రాల్లో గిట్టుబాటు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని రైతాంగం కోరుతున్నారు. ఉదానంలో పండే పంటలైన జీడి, కొబ్బరి, మునగ, పనసకు ఇంత వరకు గిట్టుబాటు ధర ప్రకటించిన సంఘటనలు లేక పోవడంతో ఉద్యాన పంటలు వ్యాపారులకు నచ్చిన ధరకు అమ్ముకొని నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. ఇప్పటికే జీడి పంటపై పోరాటాలు చేసినా ఫలితం దక్కడం లేదని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానవన శాఖాధికారులు ఉదానం పంటలు, వాటిని పండించే రైతులు పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటికి గిట్టుబాటు ధరలను ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేసే విదంగా చర్యలు చేపట్టాలని రైతాంగం కోరుతుంది.

కూటమి విజయభేరి

శ్రీకాకుళం పార్లమెంట్



విజేత: కింజరాపు రామ్మోహన్ నాయుడు

పార్టీ	అభ్యర్థి	వచ్చిన ఓట్లు
టిడిపి	కె.రామ్మోహన్ నాయుడు	7,34,501
వైసిపి	పేరాడ తిలక్	4,20,394
కాంగ్రెస్	పేడాడ పరమేశ్వరరావు	6,472

మెజారిటీ: 3,14,107

సార్వత్రిక ఎన్నికల్లో సిక్కోలు గెడ్డపై కూటమి సత్తా చాటింది. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. టిడిపితో జత కట్టిన బిజెపికి జిల్లా ఓటర్లు స్థానం కల్పించారు. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి ఎన్ఇఆర్‌కు విజయం దక్కింది. అలాగే నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను పక్కనపెట్టి కొత్తవారికి రెండుచోట్ల సీట్లు ఇచ్చినా టిడిపికి అక్కడా విజయం సొంతమైంది. శ్రీకాకుళం ఎంపీ స్థానానికి వైసిపి నుంచి కొత్త ప్రయోగం చేసి పేరాడ తిలక్‌ను పోటీలోకి దించినా సిట్టింగ్ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ముందు నిలవ లేకపోయారు. రికార్డు స్థాయిలో ఆయనకు జిల్లా ప్రజలు పట్టం కట్టారు. ఈసారి ఎన్నికల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్‌లు ఓటమి పాలయ్యారు. జిల్లాలో వైసిపి అన్ని సీట్లనూ చేజార్చుకుంది. - ప్రజాశక్తి, శ్రీకాకుళం

టెక్కలి నియోజకవర్గం



విజేత: కె.అచ్చెన్నాయుడు

పార్టీ	అభ్యర్థి	వచ్చిన ఓట్లు
టిడిపి	కె.అచ్చెన్నాయుడు	1,07,923
వైసిపి	దువ్వాడ శ్రీనివాస్	73,488
కాంగ్రెస్	కిల్లి కృపారాణి	2,684
మొత్తం పోలైన ఓట్లు :		1,86,897

మెజారిటీ 34,435

పాతపట్నం నియోజకవర్గం



విజేత: ఎం.గోవిందరావు

పార్టీ	అభ్యర్థి	వచ్చిన ఓట్లు
టిడిపి	ఎం.గోవిందరావు	86,176
వైసిపి	రెడ్డి శాంతి	61,282
కాంగ్రెస్	కె.వెంకటరావు	3,469
మొత్తం పోలైన ఓట్లు :		1,60,107

మెజారిటీ 24,894

ఆమదాలవలస నియోజకవర్గం



విజేత: కూన రవికుమార్

పార్టీ	అభ్యర్థి	వచ్చిన ఓట్లు
టిడిపి	కూన రవికుమార్	85,121
వైసిపి	తమ్మినేని సీతారాం	70,580
కాంగ్రెస్	సనపల అన్నాజీరావు	4,720
మొత్తం పోలైన ఓట్లు :		1,54,357

మెజారిటీ 33,183

పలాస నియోజకవర్గం



విజేత: గౌతు శిరీష

పార్టీ	అభ్యర్థి	వచ్చిన ఓట్లు
టిడిపి	గౌతు శిరీష	1,01,560
వైసిపి	సీదిరి అప్పలరాజు	61,210
కాంగ్రెస్	మజ్జి త్రినాథరావు	1064
మొత్తం పోలైన ఓట్లు :		1,65,257

మెజారిటీ: 40,350

నరసన్నపేట నియోజకవర్గం



విజేత: బి.రమణమూర్తి

పార్టీ	అభ్యర్థి	వచ్చిన ఓట్లు
టిడిపి	బగ్గు రమణమూర్తి	99,951
వైసిపి	ధర్మాన కృష్ణదాస్	70,580
కాంగ్రెస్	ఎం.నర్సింహమూర్తి	4,720
మొత్తం పోలైన ఓట్లు :		1,73,828

మెజారిటీ 29,371

శ్రీకాకుళం నియోజకవర్గం



విజేత: గొండు శంకర్

పార్టీ	అభ్యర్థి	వచ్చిన ఓట్లు
టిడిపి	గొండు శంకర్	1,13,455
వైసిపి	ధర్మాన ప్రసాదరావు	62,862
కాంగ్రెస్	అంబటి కృష్ణారావు	4,720
మొత్తం పోలైన ఓట్లు		1,86,658

మెజారిటీ 52,521

- ఎనిమిది అసెంబ్లీ, శ్రీకాకుళం పార్లమెంట్‌లో విజయం
- టిడిపికి ఏడుచోట్ల, జత కట్టిన బిజెపికి ఒక చోట పట్టం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సిక్కోలులో టిడిపి కూటమి హవా కొనసాగింది. మొన్నటిదాకా హీరోలుగా వెలిగిన వైసిపి నేతలు నేడు జీరోలయ్యారు. ఐదేళ్ల నిరీక్షణ తరువాత టిడిపి నేతలు మళ్లీ పట్టు సాధించారు. 2004, 2009లో ఓటమి చూసిన టిడిపి 2014లో విజయం సాధించి తిరిగి 2019లో వైసిపి చేతిలో ఓటమి పాలయ్యారు. టెక్కలి, ఇచ్ఛాపురం మినహా మిగిలిన నియోజకవర్గాల్లో ఓటమి పాలయ్యారు. గడచిన ఐదేళ్లుగా అధికారం కోసం ఎదురు చూసిన టిడిపికి 2024 ఎన్నికల్లో తిరిగి ప్రజలు పట్టం కట్టారు. జిల్లాలో ఊహించని రీతిలో ఈసారి క్లీన్ స్వీప్ చేసి ఎనిమిదికి ఎనిమిది టిడిపి కూటమి అభ్యర్థులు విజయాన్ని అందుకున్నారు. 2019 ఎన్నికల్లో ఓటమి చవిచూసిన టిడిపి నేతలు ఆత్మ విశ్వాసం కోల్పోకుండా ముందుకు సాగారు. దీనికి తోడు టిడిపి కూటమి జట్టు కట్టి గడచిన ఐదేళ్లలో క్షేత్రస్థాయిలో జనాన్ని కదిలించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, ఆయన తల్లి భువనేశ్వరి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు అనేక దఫాలుగా జిల్లాలో పర్యటించి కేడర్‌లో కదలిక తీసుకొచ్చారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలతో పాటు అభివృద్ధి లేని సంక్షేమం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు, పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్ బొమ్మ ముద్రించడం, పంట పొలాల్లో వేసిన రాళ్లపై ఆయన చిత్రాలు వంటి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ల డంలో టిడిపి నాయకులు కృత కృత్యులయ్యారు. దీనికితోడు చంద్రబాబు అరెస్టు, నారాభువనేశ్వరిపై అసెంబ్లీలో వైసిపి ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు, పోలీసు కేసులు, విద్యుత్ చార్జీల పెంపు, సాగుకు అవసరమైన పంట కాల్వల్లో పూడికతీత వంటి పనులు చేపట్టక పోవడం తదితర అంశాలను చెప్పి జనంలో కదలిక తీసుకొచ్చారు. పింఛన్ పెంపు, ఉచిత గ్యాస్ వంటి పథకాలను మేనిఫెస్టోలో చేర్చారు. టిడిపి, జనసేన, బిజెపి జత కట్టడం వలన ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని టిడిపి వదులుకుని బిజెపికి కేటాయించారు. అలాగే శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జులుగా ఉన్న గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణలను కాదని కొత్త ముఖాలు అదే పార్టీలో క్షేత్రస్థాయి నాయకులుగా ఉన్న గొండు శంకర్, మామిడి గోవిందరావులకు టిక్కెట్లు ఇచ్చారు. వారిని సైతం ప్రజలు అదరించి విజయాన్ని అందించారు.



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న రవికుమార్



ధ్రువీకరణ పత్రం అందుకున్న గొండు శంకర్



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న బెండాళం అశోక్



ధ్రువీకరణ పత్రంపై సంతకం చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న గౌతు శిరీష

ఇచ్ఛాపురం నియోజకవర్గం



విజేత: బెందాళం అశోక్

పార్టీ	అభ్యర్థి	వచ్చిన ఓట్లు
టిడిపి	బెందాళం అశోక్	1,06,596
వైసిపి	పిరియా విజయ	68,973
కాంగ్రెస్	ఎం.చక్రవర్తిరెడ్డి	744
మొత్తం పోలైన ఓట్లు :		1,60,107

మెజారిటీ 37,623

ఎచ్చెర్ల నియోజకవర్గం



విజేత: ఎన్.ఈశ్వరరావు

పార్టీ	అభ్యర్థి	వచ్చిన ఓట్లు
బిజెపి	నడుకుదిటి ఈశ్వరరావు	1,11,024
వైసిపి	గొర్లె కిరణ్‌కుమార్	82,777
కాంగ్రెస్	కె.మల్లేశ్వరరావు	2,415
మొత్తం పోలైన ఓట్లు :		2,03,831

మెజారిటీ 28,247

ఉత్సాహం... నిరుత్సాహం

- ఉదయం నుంచే టిడిపి కార్యాలయంలో సందడి
- వైసిపి శ్రేణుల్లో నెలకొన్న నిరాశ
- బోసిపోయిన వైసిపి కార్యాలయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, రూరల్

సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడితో టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం, వైసిపి శ్రేణుల్లో నిరుత్సాహం నెలకొంది. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకే టిడిపి, వైసిపి నాయకులు నగరంలోని ఆయా పార్టీల కార్యాలయాలకు చేరుకున్నారు. ఫలితాలను వీక్షించేందుకు వైసిపి కార్యాలయంలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ద్వితీయ శ్రేణి నాయకులంతా కోలాహలం చేశారు. టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు టిడిపి ఆధిక్యం పెరిగిన నుంచి కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. ప్రతి రౌండ్ ఫలితాలను టివి ద్వారా వీక్షిస్తూ, ఫోన్‌లో సమాచారం తెలుసుకుంటూ గడిపారు. టిడిపి అభ్యర్థి గొండు శంకర్ కార్యాలయం వద్ద అభిమానులు పెద్దఎత్తున చేరుకుని శంకరన్న నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.



ఎంపీ కార్యాలయంలో కార్యకర్తల సందడి



బోసిపోయిన వైసిపి కార్యాలయం

వైసిపి శ్రేణుల్లో నిరాశ

గంట గంటకు పెరుగుతున్న ఆధిక్యత, ఫలితాలు ఏకపక్షం కావడంతో టిడిపి కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. ఇందుకు భిన్నంగా వైసిపి, కాంగ్రెస్ కార్యాలయాల్లో నిస్తేజం నెలకొంది. ఎంపీ రామ్మోహన్ నాయుడు నివాసంలో టిడిపి నాయకులు, అభిమానులు సందడి చేశారు. టిడిపికి అనుకూలంగా ఫలితాలు వస్తుండడంతో వైసిపి కార్యాలయం బోసిపోయింది.

కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు!

- సాగునీటి కల నెరవేరేనా?
- కొబ్బరి పార్కు, జీడి మద్దతు ధరపై రైతుల ఎదురుచూపు

ప్రజాశకి - కవిటి

కొత్త ప్రభుత్వంపై జిల్లా రైతాంగం కోటి ఆశలు పెట్టుకుంది. కూటమి అధికారంలోకి వస్తే నదుల అనుసంధానం చేసి ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తామన్న టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, నారా లోకేష్ మాటలు నేడు ఇచ్ఛాపురం నియోజకవర్గ రైతాంగం గుర్తు చేసుకుంటోంది. అదే విధంగా ఎప్పటి నుంచో కొబ్బరి రైతులను ఊరిస్తున్న కొబ్బరి పార్కు, ఏడాదికి పైగా జీడి మద్దతు ధర కోసం పోరాడుతున్న రైతాంగం తమకు మేలు జరుగుతుందని ఆశగా ఎదురుచూస్తోంది. వెరసి కొత్త ప్రభుత్వంపై జిల్లా రైతాంగం కోటి ఆశలు పెట్టుకుంది.

వంశధార నదీ జలాలతో...

వంశధార నదీ జలాలు పూర్తిస్థాయిలో వినియోగిస్తే ఇచ్ఛాపురం చివరి వరకు సాగునీటికి కొరత ఉండదని, ముఖ్యంగా నేరడి బ్యారేజ్ సమస్యలు తొలగిపోతే ఇది సాధ్యమవుతుందని వంశధార సాధన కమిటీ ఘంటా పథంగా చెబుతోంది. దీనికోసం నియోజకవర్గ వ్యాప్తంగా రైతులను ఏకం చేసి వారిలో అవగాహన పెంపొందిస్తోంది. గతంలో పలాస వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దీనిపై వినతిపత్రం కూడా అందించింది. పారిశ్రామికంగా వెనుకబడిన ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 80 శాతం ప్రజలకు వ్యవసాయమే జీవనాధారంగా ఉందని, ఇటువంటి పరిస్థితుల్లో సాగునీరు వచ్చేవరకు తమకు పోరాటం తప్పదని అంటోంది.

కొబ్బరి పార్కుపై ఆశలు

మరోవైపు కొబ్బరే జీవనాధారంగా జిల్లావ్యాప్తంగా కొన్ని వేలమంది జీవిస్తున్నారు. నాణ్యతలో కేరళ కొబ్బరిని మించిన ఉద్దానం కొబ్బరిని ప్రధాన ఎగుమతిదారు ఒడిశా. అక్కడ తేడా కొడితే ఇక అంతే. దళారి చెప్పిందే ధర. ఇచ్చిందే డబ్బు. అటువంటి పరిస్థితుల్లో ఉన్న కొబ్బరి రైతులకు గతంలో టిడిపి హయాంలో మండలంలోని శిలగాంలో కొబ్బరి పార్కు ఏర్పాటుకు స్థల సేకరణ కూడా జరిగింది. కానీ, ఆ తరువాత అనేక కారణాలతో అది ప్రకటనలకే పరిమితమవుతూ వస్తోంది. మళ్లీ ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో మరోసారి కొబ్బరి పార్కుపై రైతుల ఆలోచనలు మల్లుతున్నాయి.

జీడికి దక్కని మద్దతు ధర

జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కోసం ఏడాదిపైగా రైతులు పోరాటం చేస్తున్నారు. అయినా వారికి 'మద్దతు' కరువవుతోంది. జీడిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ లక్ష మంది రైతులు సంతకాలు చేసి గతేడాది డిసెంబరులో స్వయంగా ముఖ్యమంత్రికి అందించారు. ఆ తరువాత ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి స్వయంగా తమ సమస్య వివరించారు. అయినా ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ మాత్రం లభించలేదు. పలాస, వజ్రపుకొత్తూరు, మందస కవిటి, కంచిలి, సోంపేటతో పాటు జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో జీడి పంట సాగవుతోంది. దీనిపై ఆధారపడి ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 80 వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. అదే జీడికి మద్దతు ధర కల్పిస్తే తమకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్థానికులు ఆశ పడుతున్నారు.

'మద్దతు' ఇస్తామన్న టిడిపి

మరోవైపు తాము అధికారంలోకి వస్తే జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించి ఆదుకుంటామని ఎన్నికల ప్రచారంలో భాగంగా పలాస వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అదేవిధంగా తమ ప్రచారంలో భాగంగా ఎంపీ రామ్మోహన్‌నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ జీడికి మద్దతు ధర కల్పించి జీడి రైతుకి అండగా ఉంటామంటూ హామీ ఇచ్చారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి వచ్చింది కాబట్టి ఇప్పటికైనా తమకు న్యాయం జరుగుతుందని అటు వంశధార సాధన కమిటీతో పాటు ఇటు కొబ్బరి, జీడి రైతాంగం ఎదురుచూస్తోంది.

ఎన్ఇఆర్ విజయం


ఈశ్వరరావు

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల వేళ ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావుకి ఈసారి టికెట్ దక్కలేదు. అయితే చిపురుపల్లి నియోజకవర్గం నుండి పోటీ చేసి మంత్రి బోత్స సత్యనారాయణపై విజయం సాధించారు. అలాగే ఇదే నియోజకవర్గం నుంచి టిక్కెట్ ఆశించిన కలిశెట్టి అప్పలనాయుడు విజయనగరం ఎంపిగా పోటీ చేసి విజయం సాధించారు. పొత్తులో భాగంగా ఈ సీటు బిజెపికి దక్కింది. ఇక వైసిపి మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కు మరోసారి అవకాశం ఇచ్చింది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు వైసిపి అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌పై 28,952 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎన్ఇఆర్ గెలుపునకు నియోజకవర్గంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేసారు. సూపర్ సిక్స్, చంద్రబాబు మేనిఫెస్టో ప్రజలు నమ్మడం, అలాగే చంద్రబాబు అరెస్టుతో టిడిపి కేడర్ పనిచేయడం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తమ భూమిపై హక్కులు ప్రభుత్వానికి వెళ్లిపోతాయన్న భయం, మద్యంలో చీప్ బ్రాండ్లు, అత్యధిక రేట్లు, రోడ్లు దారుణంగా ఉండటం, 60 గజాల ఇళ్లస్థలాలే ఇవ్వడం, అదీ ఊరుకు దూరంగా, మునిగిపోయే చోట ఇచ్చారని మహిళల్లో అసంతృప్తి బాగా పనిచేసింది. ఎన్ఇఆర్ పలు సేవా కార్యక్రమాలు చేయడం ఆయన ఎమ్మెల్యే అయితే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తారని ప్రజలు నమ్మి ఆయనకు పట్టం కట్టారు.


కేకు కట్ చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

టిడిపి సంబరాలు

పొందూరు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమదాలవలస నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ 33,225 ఓట్లు భారీ మెజార్టీతో ప్రత్యర్థి తమ్మినేని సీతారాంపై గెలుపొందడంతో కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని రాపాక, పొందూరు, కింతలి, లోలుగు, తోలాపి, కనిమెట్ట, బొడ్డేపల్లి, తాడివలస, గోరింట, బురిడి కంచరాం, పిల్లలవలస, ధర్మపురం, వి.ఆర్.గూడెం, మజ్జిలిపేట, తదితర గ్రామాల్లో కార్యకర్తలు కేకులను కట్‌చేసి స్వీట్స్‌ను పంచిపెట్టారు. బాణాసంచాను కాల్చారు. ఒకరి కొకరు అభినందనలు తెలుపుకుంటూ డాన్స్‌లు చేస్తూ నినాదాలు చేశారు. ఇందులో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, టిడిపి నాయకులు అనకాపల్లి చిన్నరంగా, బలగ శంకర భాస్కరరావు, కండాపు శ్రీను, అన్నెపు రాము, చింతాడ కృష్ణవాసుదేవరావు, మద్దెల శ్రీను, సురేష్, మనోహర్, సువ్వారి మధు పాల్గొన్నారు.


జ్ఞాపికను అందుకుంటున్న సౌమ్య

అరసవల్లిని సందర్శించిన సౌమ్య

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సీనియర్ ఐఆర్ఎస్ అధికారి నూతలపాటి సౌమ్య కుటుంబసమేతంగా సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామివారి సేవల అనంతరం అనివేటి మండపంలో ఆలయ అర్చకులు వారిని స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి ఆశీర్వదించారు. జ్ఞాపికను ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు అందజేశారు.

స్పీకర్ తమ్మినేని ఓటమి

ప్రజాశక్తి- పొందూరు

నియోజకవర్గంలో ప్రత్యమ్నాయం లేకుండా రాజకీయంగా ఎదిగేవారిని అణగతొక్కేయడం. ఎన్నికల సమయంలో తన వెంట వచ్చేవాళ్ళ రండి, పోయేవాళ్ల పోండి అని క్యాడర్‌ని కలుపుకొని వెళ్లకపోవడం. రెండు నదుల మధ్యన గల నియోజకవర్గంలో ఇసుక సామాన్యుడికి అందకుండా ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించడం. పాలనలో కుటుంబ సభ్యుల మితిమీరిన జోక్యం. నియోజకవర్గంలో కొన్ని సమస్యలను స్పీకర్ దృష్టికి కూడా వెళ్లకుండా కుటుంబ సభ్యులు జోక్యం.


బోసిపోయిన తమ్మినేని నివాస ప్రాంతం

కొంతమంది అధికారు లను తన చెప్పుచేతల్లో ఉంచుకుని అన్ని విభాగాల్లో వసూళ్లకు పాల్పడడం. నియోజక వర్గంలో పలువురిపై ఆర్థికంగా నష్టపర్చడం వంటి కక్షపూరిత చర్యలకు పాల్పడడం. నాడు-నేడు పనుల్లో పర్సంటే జీలు, పనులు సక్రమంగా చేపట్టక పోవడం. జలజీవన్ పనుల్లో నాసిరకంగా పనులు చేపట్టడంతో పాటు గుత్తేదారుల నుంచి పర్సంటేజీలు వసూలు. ప్రధానంగా శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి పనులు అర్ధాంతరంగా వదిలివేయడం. స్వతంత్ర అభ్యర్థిగా గాంధీ పోటీ చేయడం. పెత్తందారీ వ్యవస్థను ప్రోత్సహించడం. నియోజక వర్గంలో స్థానిక నాయకులు దూకుడు, తప్పుడు చర్యలకు వత్తాసు పలుకుతూ ప్రోత్సహించడం. నియోజక వర్గంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని తొల గించి ఆ పోస్టులను అమ్ముకున్నట్లుగా ప్రచారం. నియోజక వర్గంలో భూములు, స్థలాల ఆక్రమణకు పాల్పడినట్లు ప్రచారం.

బోసిపోయిన సభాపతి నివాసం

ఆమదాలవలస: శాసనసభాపతిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సుమారు ఐదేళ్ల పట్టణంలోని పూజారిపేటలో ఉన్న తమ్మినేని సీతారాం నివాసం కలకల లాడేది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో సొంత మేనల్లుడు కూటమి అభ్యర్థి కూన రవికుమార్ చేతిలో ఘోర పరాజయం పొందారు. తమ్మినేని ఓటమితో ఆయన నివాసం వద్ద కార్య కర్తలు, అభిమానులు లేక వెలవెల బోయింది. దీంతో నిత్యం కళకళలాడే పూజారి పేటలో ఉన్న తమ్మినేని స్వగృహం ఒక్కసారిగా బోసిపోయింది. దీంతో అటువైపుగా వెళ్లే ప్రజలు నిన్న మొన్నటి వరకు నడవడానికి కాళీలేని రహదారి నేడు జనసంచారం లేక వెలవెలపోతుందని చర్చించుకోవడం విశేషం. టిడిపి ఘన విజయం సాధించిన సందర్భంగా స్పీకర్ నివాసం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కె. వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


సీతారాం ఇంటి వద్ద పోలీసు బందోబస్తు

పవన్ త్యాగంతోనే వైసిపి విముక్తి

- భావితరాల కోసం ముందుచూపు
- 21 స్థానాల్లోనూ గెలుపు ఆనందం
- జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ త్యాగ ఫలితమే నేడు వైసిపి విముక్తి ఆంధ్రప్రదేశ్‌ను సాధించుకోగలిగామని జనసేన పార్టీ నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని దానేటి శ్రీధర్ ఆస్పత్రిలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్ తరాల కోసం ముందుచూపుతో ఆలోచించి పవన్ కళ్యాణ్ తనను తాను తగ్గించుకొని ప్రజల ముందు నిల్చున్నారని కొని యాడారు. సంక్షేమం ఒక్కటే పాలన కాదని, అభివృద్ధి చేయడం, నిరుద్యోగం, వలసలు తగ్గించడం వంటివి కూడా పాలనలోకి వస్తుందని డాక్టర్ శ్రీధర్ చెప్పారు. ప్రజలు పవన్‌కళ్యాణ్‌ను నమ్మి జనసేన పార్టీ నాయకులను 21 స్థానాలకు 21 స్థానాల్లో గెలిపించారని చెప్పారు. రానున్న భవిష్యత్ తరాలను పవన్ కళ్యాణ్ ఒక వరంలా మారతారని వివరించారు. కూటమి గెలిచిన వెంటనే తమ తొలి సంతకం మెగా డిఎస్‌సిపై చేస్తానని చెప్పారని, ఇది రాష్ట్రానికి శుభపరిణామని చెప్పారు. పవన్ కళ్యాణ్ చెప్పిన ఒకేఒక్క మాట రాష్ట్రంలో కూటమికి నాంది పలికిందని చెప్పారు. ఈసారి ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనిచ్చే ప్రసక్తే లేదని చెప్పిన మాట అప్పటి వరకూ ఉన్న రాజకీయాలను మలుపు తిప్పిందని గుర్తు చేశారు. వైనాట్ 175 అంటూ వైసిపి వేసుకున్న లెక్కలను తారుమారు చేసి రాష్ట్రంలో అధికార మార్పిడికి బాటలు వేసిందని పేర్కొన్నారు. కూటమి రానున్న ఐదేళ్లలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా సుపరిపాలన అందిస్తుందని చెప్పారు. ఇంతటి గొప్ప విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు, జనసేన నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


మాట్లాడుతున్న దానేటి శ్రీధర్

అదే రిపీట్ అయింది

శాసనసభాపతి సీతారాం పరాజయం

ప్రజాశక్తి- ఆమదాలవలస



రాష్ట్రంలో ఏ పార్టీ అధికారం చేపట్టిన స్పీకర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన వ్యక్తి తరువాత జరిగే ఎన్నికల్లో ఓటమి చవిచూడడం ఆన వాయితీగా వస్తుంది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో కూడా మరోసారి అదే పునరావృతమైంది. 1999 నుంచి శాసనసభ స్పీకర్లుగా పనిచేసిన వారు తరువాత వచ్చే ఎన్నికల్లో గెలిచిన దాఖలాలు ఇప్పటివరకు కనిపించలేదు. ప్రస్తుత ఎన్నికల్లో శాసనసభాపతి తమ్మినేని సీతారాం ఓటమితో ఇది మరింత స్పష్టమైంది. మరి ఇటువంటి పరిస్థితుల్లో ఈ నెల 9న ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం కొలువుదీరనున్న అసెంబ్లీలో రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఎవరు పదవీ బాధ్యతలు స్వీకరిస్తారా అన్న ఉత్సుకత నెలకొంది.

తండ్రిని మించిన తనయ

ప్రజాశక్తి- పలాస

వైసిపికి చెందిన డాక్టర్ సీదిరి అప్పలరాజుపై టిడిపి అభ్యర్థిగా పోటీచేసిన గౌతు శిరీష 39,283 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించింది. తాత గౌతు లచ్చన్న, తండ్రి గౌతు శివాజీ వారసురాలిగా 2019 ఎన్నికల్లో పలాస అసెంబ్లీ బరి నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీచేసి అప్పలరాజుపై 15.484 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఎంబిఎ, బిఎల్ విద్యను అభ్యసించిన శిరీష 2004 నుంచి టిడిపి క్రియాశీలక రాజకీయాల్లో చేరారు. 2014 సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి, జిల్లాను ద్వితీయ స్థానంలో నిలబెట్టారు. 2015 నుంచి 2019 వరకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా పనిచేశారు. 2019 నుంచి రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఓటమి చవిచూసినప్పటికీ పట్టువదలి విక్రమార్కుడిలా గ్రామ, గ్రామాల పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. సొంపేటలో తన తండ్రి ఇళ్లు ఉండడంతో స్థానికేతురాలు అనే విమర్శను తిప్పి కొట్టేందుకు పలాసలోనే తన గృహాన్ని నిర్మించుకున్నారు.

నమ్మకమే గెలిపించింది: గౌతు శిరీష

గౌతు కుటుంబంపై ప్రజలకు ఉన్న నమ్మకమే తనను గెలిపించిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. వైసిపి ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా తన పార్టీలో ఉన్న వారు ఏ ఒక్కరూ పార్టీ మారకుండా ఆడపిల్లనయినా తనపై నమ్మకం పెటుకొని పనిచేశారని అన్నారు. అదేవిధంగా వైసిపి నుంచి టిడిపిలో చేరిన నాయకులూ తన గెలుపుకోసం కసిగా పనిచేశారన్నారు. తన విజయంలో సగభాగం జనసేనకు చెందుతుందని, జనసేనకు చెందిన యువత అంతా పూర్తిస్థాయిలో టిడిపి అభ్యర్థి అయిన తన విజయానికి కృషి చేశారని అన్నారు.


మాట్లాడుతున్న శిరీష

తీరంలో సినిమా షూటింగ్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరంలో పరిసరాల్లో మంగళవారం మిరాజ్ సినిమా యూనిట్ చిత్రీకరణలో బిజీబిజీగా గడిపింది. చిత్ర దర్శకుడు విష్ణుదేవ్ మాట్లాడుతూ జిల్లాలో సినిమా షూటింగ్ కోసం మంచి లొకేషన్లు ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని చిత్ర నిర్మాణ సంస్థలు ఇక్కడకు వచ్చి షూటింగ్ జరుపుకోడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. స్థానిక కళాకారులూ మంచి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ఫిలిమ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు కుమార్ నాయక్ మాట్లాడుతూ స్థానికంగా కళలను ఆరాదించే మంచి కళాకారులు ఉన్నారని తెలిపారు. సినిమా డిమాండ్ మేరకు స్థానిక కళాకారులకు అవకాశాలు ఉంటాయని అన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆడుతూ పాడుతూ ఎటువంటి బడలిక లేకుండా షూటింగ్ జరుగుతుందన్నారు. సహకరిస్తున్న స్థానిక కళాకారులకు ధన్యవాదములు తెలిపారు. నిర్మాత కె.సత్యభాస్కర్, డిఒపి మీరాఖాన్, మేనేజర్ ప్రదీప్, నర్రా ప్రసాద్, కొరియాగ్రాఫర్ పత్రి తాతారావు పాల్గొన్నారు.


సన్నివేశాల చిత్రీకరణ

గౌతు శిరీషకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

పలాస ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష విజయం సాధించడంతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, సాసుమాన చంద్రమౌళి, టిడిపి నాయకులు కార్యకర్తలు శ్రీకాకుళం జాతీయ రహదారి వద్ద స్వాగతం పలుకుతూ ఘనంగా సన్మానించారు.


శిరీషతో బాబూరావు తదితరులు

రికార్డు సృష్టించిన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస, పొందూరు

నియోజకవర్గంలో ఏర్పడిన తరువాత ఇప్పటివరకు ఏ అభ్యర్థి సాధించని మెజార్టీ సాధించి కూటమి అభ్యర్థి కూన రవికుమార్ రికార్డ్ సృష్టించారు. మంగళవారం వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో రాష్ట్ర శాసనసభాపతి తమ్మినేని సీతారాంపై రవికుమార్ సాధించిన మెజార్టీ. నియోజకవర్గ చరిత్రలో అత్యధిక మెజార్టీ కావడం విశేషం. నగిరి కటకం ఆమదాల వలస నియోజకవర్గాల్లో గతంలో జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటివరకు ఎవరు సాధించని మెజార్టీని సాధించారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాల్లో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డేపల్లి సత్యవతి సాధించిన 16,209 ఓట్లు అత్యధిక మెజార్టీ కాగా 1999లో తమ్మినేని సీతారాం సాధించిన మెజార్టీ 1511 అత్యల్పంగా ఉన్నాయి. అయితే ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రవికుమార్ సర్వేలు ప్రజలు, వివిధ రాజకీయ పార్టీ నాయకుల అంచనాలను తారుమారు చేస్తూ ఊహలకు అందని విధంగా 33285 వేల ఓట్ల మెజార్టీ సాధించి అఖండ విజయం సాధించారు. అత్యధిక మెజార్టీ సాధించిన రవికుమార్‌ను నియోజకవర్గంలోని నాలుగు మండలాల మున్సిపాలిటీకి చెందిన ప్రజలు అభినందనలు తెలుపుతూ జిల్లాలో ప్రధాన సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడుగా గుర్తింపు ఉన్న రవికుమార్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం ఖాయమంటూ టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలుపుతున్నారు.



విక్టరీ సింబల్‌ను చూపిస్తున్న రవికుమార్

పొందూరు: గత కొన్ని రోజులుగా ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మంగళవారం జరిగిన ఓట్లు లెక్కింపులో ఆమదాలవలస నియోజకవర్గం అభ్యర్థి కూన రవికుమార్ అఖండ విజయం సాధించారు. ఈయన తన ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాంపై సుమారు 33,225 ఓట్లు తేడాతో గెలుపొందారు.

గెలుపునకు కారణాలివే...

విద్యావంతుడు, సౌమ్యుడు అనే ప్రజల్లో అభిప్రాయం. పార్టీ ఇమేజ్, వ్యక్తిగత ఛరిష్మా. ఐదేళ్లుగా రవికుమార్‌పై తప్పుడు కేసులతో వేధిస్తూ ఇబ్బందులకు గురిచేయడంతో ప్రజల్లో సానుభూతి. ప్రతి ఒక్కరిని కలుపుకుని వెళ్లే వ్యక్తిత్వం. నియోజకవర్గంలో గతంలో రవికుమార్ చేసిన అభివృద్ధిపై ప్రజల్లో నమ్మకం. కిందిస్థాయి నుంచి క్యాడర్‌ను బలోపేతం చేయడం. అధికారం లేకపోయినప్పటికీ అనుచరులను అంటిపెట్టుకుని వారిలో విశ్వాసాన్ని పెంపొందించడం. పాలన అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహనను కలిగిఉండడం. కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు అండగా నిలవడం వంటి అనేక అంశాలు ఆయన గెలుపునకు దోహదం చేశాయి.

శంకర్ రికార్డు విజయం



శ్రీకాకుళం రూరల్ : అభిమానులకు కేకు తినిపిస్తున్న శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి టిడిపి కూటమి అభ్యర్థి గొండు శంకర్ విజయం సాధించారు. రికార్డు స్థాయిలో మెజార్టీని సొంతం చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి హవా కొనసాగింది. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి తొలిసారి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన గొండు శంకర్ ఎవ్వరూ ఊహించని రీతిలో విజయాన్ని అందుకున్నారు. రాష్ట్ర రెవిన్యూ మంత్రి, సీనియర్ రాజకీయ వేత్త ధర్మాన ప్రసాదరావుపై రికార్డుస్థాయి మెజార్టీతో శంకర్ విజయాన్ని అందుకున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి తొలిసారి పోటీ చేసిన ఆయన తెలుగుదేశం, జనసేన, బిజెపి సహకారంతో విజయం సాధిస్తానని చెప్పినట్టుగానే విజయాన్ని అందుకున్నారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆయన గ్రామ సర్పంచ్‌గా రాజకీయాల్లోకి ప్రవేశించి గుండ కుటుంబానికి విధేయునిగానే పార్టీలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనూహ్యంగా ఆయనకు ఈసారి తెలుగుదేశం పార్టీ టిక్కెట్‌ను కేటాయించడంతో ప్రత్యర్థులు ఇక తమదే విజయమని దీమాపడ్డారు. సొంత పార్టీలో గుండ కుటుంబం నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చినా పార్టీ అధిష్టానం మాత్రం ఆయన అభ్యర్థిత్వాన్నే కొనసాగించింది. క్షేత్ర స్థాయిలో టిడిపితో పాటు బిజెపి, జనసేన శ్రేణులను తనకు అనుకూలంగా మార్చుకుని వ్యూహాత్మకంగా శ్రమించిన ఆయన ప్రత్యర్థి సీనియర్ మంత్రి ధర్మానతో తలపడ్డారు. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి గతంలో విజయాన్ని అందుకున్న వారందరికి మించి రికార్డు స్థాయిలో గొండు శంకర్ మెజార్టీ సాధించారు.

శ్రీకాకుళం రూరల్ : కూటమి ఎమ్మెల్యే గొండు శంకర్ ఘన విజయం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అయన సతీమణి మాజీ సర్పంచ్, నియోజకవర్గం తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి గ్రామ దేవతలకు మంగళవారం ముడ్రాటలు సమర్పించారు. సింగుపురం, కిట్టప్పపేట గ్రామ దేవత చెవిటమ్మతల్లి, నీలమ్మ అమ్మవార్లకు స్వాతి, కార్యకర్తలు గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని ముడ్రాటలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జగన్నాథరావు పాల్గొన్నారు.



శంకర్ కోసం ఏర్పాటు చేసిన గజమాల

కార్యకర్తల సంబరాలు

సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా శంకర్ గెలవడంతో మండలంలోని కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. కిష్టప్పపేట ఆయన స్వగ్రామానికి కార్య కర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. పెద్దఎత్తున బాణాసంచా కాల్చి, గజ మాలను ఏర్పాటు చేశారు.

ప్రజాస్వామ్యాన్ని బతికించారు

టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



వెంకటరమణ

తెలుగుదేశం కూటమి ఒక చారిత్రాత్మక విజయమని, గతంలో ప్రజలు ఒక్కసారి అవకాశమని నమ్మి ఐదేళ్ల పాటు వెనుకబాటుకు గురయ్యారని టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకట రమణ పేర్కొన్నారు. మంగళవారం ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై సుదూర ఆలోచన గల దార్శనికుడు చంద్రబాబు అని కొనియాడారు. ఆయనపై ప్రజలు విశ్వసనీయతతోనే చారిత్రాత్మక విజయాన్ని అందించారన్నారు. నిబద్ధత గల ముందు చూపున్న నాయకుడని కాదన్నందుకు మూడు దశాబ్దాలు వెకబడ్డామన్నారు. గడచిన ఐదేళ్లలో తిరోగమనం వలన పెద్దఎత్తున ప్రజలు నష్ట పోయాం న్నారు. ఐదేళ్ళ కిందట ప్రజావేదిక కూల్చివేసి విధ్వంశంలో మొదలుపెట్టిన జగన్‌పాలన ఐదేళ్లలో ఎన్నో విధ్వాంశాలకు కారణమైందన్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజక వర్గంతో పాటు 8 అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులకు విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.



ధర్మాన కార్యాలయం

బోసిపోయిన ధర్మాన కార్యాలయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు పెదపాడు వద్ద నున్న కార్యాలయం మంగళవారం కార్యకర్తలు, ప్రజలు ఎవరూ లేకపోవడంతో బోసిపోయింది. సార్వత్రిక ఎన్నికల్లో ధర్మాన ప్రసాదరావు ఓటమి పాలయ్యారు. దీంతో కార్య కర్తలు ఎవరూ లేకపోవడంతో కార్యాలయం ఖాళీగా దర్శనమిచ్చింది.

కిరణ్ కుమార్ పరాజయం

ప్రజాశక్తి- రణస్థలం

ఎచ్చెర్ల నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావుపై ఘోర పరాజయం చవిచూశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేపై మొదటి నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు వ్యతిరేకతగానే ఉన్నారు. నియోజకవర్గంలో ఎవరిని పట్టించుకోకపోవడం, ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చిన వారిని పలకరించకపోవడం, అభివృద్ధి కార్యక్రమాలపై పెద్దగా దృష్టి పెట్టకపోవడం, అలాగే వ్యతిరేక పత్రికల్లో వ్యతిరేక వార్తలు రావడంతో తదితర అంశాలపై ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ని ఎచ్చెర్ల నియోజకవర్గం ప్రజలు పూర్తిస్థాయిలో విస్మరించారు.

నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి- ఆమదాలవలస



రవికుమార్

నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తనకు అఖండ విజయాన్ని చేకూర్చిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు, కార్య కర్తలకు, అభిమాను లకు శాసన సభ్యులు కూన రవికుమార్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి ఐదేళ్ల పాలనలో తనతో పాటు అన్ని కార్యక్రమాల్లో కష్ట సుఖాల్లో పాలు పంచుకొని తనకు సహకరించిన ప్రతిఒక్కరికి అలాగే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అన్ని విధాలుగా సహకరించిన కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనపై నమ్మకం పెట్టుకుని శాసనసభ్యునిగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ చరిత్రలో ఏనాడూ ఏ అభ్యర్థికిరాని అత్యధిక మెజార్టీని తనకు ఇచ్చిన ఓటర్లు అందరికి ఐదేళ్లు నిరంతరం ప్రజాసేవలో ఉండి ప్రతిఒక్కరి రుణం తీర్చుకుంటానన్నారు.

స్థానికునికే పట్టం

ప్రజాశక్తి- పాతపట్నం



మామిడి గోవిందరావు

పాతపట్నం నియోజక వర్గంలో స్థానికు డైన మామిడి గోవిందరావుకు ఓటర్లు పట్టం కట్టారు. కొన్నాళ్ళుగా ప్రజలు స్థానికుడే కావాలి... స్థానికేతరులు వద్దు అనే నినాదాలు చేశారు. దీంతో టిడిపి అధిష్టానం స్థానికుడైన మామిడి గోవిందరావుకు బిఫారం అందజేశారు. దీంతో ఎమ్మెల్యేగా గెలిపించుకుని కిరీటం తగిలించారు. పదేళ్ళుగా నియోజకవర్గంలోని ఐదు మండలాలు తన సొంత గ్రామాలుగా మలుచుకొని ప్రతి పేదవాడి కష్టంలోనూ నేనున్నానంటూ నాన్న ట్రస్టు తరుపున ఆర్థికసాయం చేశారు.

సాధారణ వ్యక్తిగా జీవితం మొదలుపెట్టి ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని నావిడు గోవిందరావు అంటున్నారు. గోవిందరావు తల్లి మహాలక్ష్మి గతంలో వైస్ ఎంపిపిగా పాతపట్నం మండలంలో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. తరువాత వారి కుటుంబంలో ఎవరూ రాజకీయ ప్రస్తావనం లేదు. ఇప్పుడు గోవిందరావు ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ కాదని ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే మొట్టమొదటిసారిగా పోటీ చేసి 25 వేల పైచిలుకు అత్యధిక మెజార్టీ ఓట్లతో రెడ్డి శాంతిపై గెలుపొందారు. పాతపట్నాన్ని కొత్తపట్నంగా మార్చి నియోజకవర్గ అభివృద్ధిలో నిరంతరం కృషి చేస్తానని, గెలుపునకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

కంచుకోట పదిలం

అశోక్ హ్యాట్రిక్ విజయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం, కవిటి

బెందాళం అశోక్ ముచ్చటగా మూడోసారి ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ విజయం సాధిం చారు. తన సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి పిరియా విజయపై 38 వేల పైచిలుకు ఓట్లతో అఖండ విజయాన్ని సొంతం చేసుకున్నారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా కొన సాగుతున్న అశోక్ ప్రస్తుతం సాధించిన విజయానికి కేవలం ప్రభుత్వ వ్యతిరేకతే కారణం కాదు. గతంలో జరిగిన పొరపాట్లు సరిదిద్దు కుంటూ, పార్టీలకు అతీతంగా నిత్యం ప్రజలతో ఉంటూ తనకంటూ నియోజక వర్గంలో ఒక పెట్టనిగోడ కట్టుకున్నారు. ముఖ్యంగా నియోజక వర్గ వ్యాప్తంగా యువకులు, మహిళలు ఎమ్మెల్యే అశోక్‌కు వీరాభి మానులుగా మారిపోయారంటే ఎంతగా జనాల్లో కలిసిపోయారో అర్థం చేసుకోవచ్చు.



కవిటి : అశోక్‌ను సన్మానిస్తున్న నాయకులు

జనసేన అండ

ఇక పొత్తులో భాగంగా జనసేన పార్టీతో పూర్తిగా సమన్వయం చేసుకుని ముందుకు సాగారు. అదే రీతిలో జనసైనికులు తమ పూర్తి సహాయ సహకారాలు అందించి టిడిపి విజయానికి కృషి చేశారు. మొత్తంగా ముచ్చటగా మూడోసారి ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ విజయం సాధించిన అశోక్ మంత్రి పదివి చేపట్టి నియోజకవర్గ అభివృకి కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. అశోక్‌కి 1,8,608 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి పిరియా విజయకు 70,130 ఓట్లు వచ్చాయి. దీంతో 38,608 ఓట్లతో విజయం సాధించారు. 1985 ఎన్నికలో కీర్తిశేషులు ఎం.వి.కృష్ణారావు 35 వేలు ఓట్లు మెజారిటీతో రికార్డు నెలకొల్పారు. ప్రస్తుతం 38,608 ఓట్లతో గెలుపొంది ఆ రికార్డును తిరగ రాశారు. 2019 ఎన్నికల్లో వైసిపి హవాలోనూ అశోక్ గెలు పొందారు. కూటమి వల్ల ఈ నియోజక వర్గంలో జనసేన నాయ కులు కలిసి రావడంతో అశోక్‌కు మరింత బలాన్ని ఇచ్చింది. వైసిపి ఓటమికి అనేక కారణాలు ఉన్నాయి. కంచుకోటలో పాగా వేయాలని వైసిపి నేతలు ఆలోచన విధానం బెడిసి కొట్టింది. చివరికి పోల్ మ్యానేజ్ మెంట్ కోసం మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి మంత్రం ఫలించలేదు. వైసిపి పార్టీలో అడుగడుగునా బెదిరింపులు, అలక పాన్పులు ఓటమికి కారణ మైంది. సోషల్ మీడియాపై ఎక్కువ నమ్మకం పెట్టుకొని స్థానిక మీడియాకు దూరం పెట్టడం వైసిపి చేసిన పెద్ద తప్పు.

తొలిసారి శాసనసభకు నలుగురు

టిడిపి నుంచి ముగ్గురు, బిజెపి నుంచి ఒకరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర శాసన సభలో జిల్లా నుంచి నలుగురు కొత్తగా అడుగు పెట్టనున్నారు. ప్రజలు వారికి పట్టం కట్టారు. జిల్లాలో పలాస నియోజక వర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి కొత్తగా విజయాన్ని అందుకున్నారు. ఈమె ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు గౌతు లచ్చన్న మనవరాలు. మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ కుమార్తె. గత ఎన్నికల్లో పలాస నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. వైసిపి అభ్యర్థి, సిట్టింగ్ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఓడించి ఆమె ఈసారి విజయాన్ని అందుకున్నారు. తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు.

శ్రీకాకుళం నియోజక వర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా తొలిసారి పోటీ చేసిన గొండు శంకర్ విజయాన్ని దక్కించుకుని అసెంబ్లీకి వెళ్లనున్నారు. రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై ఆయన రికార్డు స్థాయిలో మెజార్టీ సాధించి విజయాన్ని అందుకున్నారు. విద్యావంతుడైన శంకర్ గ్రామ సర్పంచ్‌గా పనిచేసి ఈసారి అనూహ్యంగా టిక్కెట్టు దక్కించుకుని విజయాన్ని అందుకున్నారు. పాతపట్నం నుంచి టిడిపి అభ్యర్థిగా తొలిసారి పోటీ చేసిన మామిడి గోవిందరావు ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతిపై గెలుపొందారు. ఆయన రాజకీయాలకు కొత్తగా వచ్చినా ప్రజలు అయనకు పట్టం కట్టారు. ఈయన కూడా తొలిసారి శాసనసభలో జిల్లా నుంచి అడుగు పెడుతున్నారు. ఎచ్చెర్ల నియోజక వర్గం నుంచి కూటమి తరపున బిజెపి అభ్యర్థిగా బరిలోకి దిగిన నడికుదుటి ఈశ్వరరావు కూడా గతంలో గ్రామస్థాయి రాజకీయాలకు పరిమితమైన వ్యక్తి. ఈసారి ఎన్నికల్లో అనూహ్యంగా ఈ టిక్కెట్టు కూటమి బిజెపికి కేటాయించడంతో బరిలో నిలిచారు. వైసిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌పై ఆయన విజయాన్ని సొంతం చేసుకుని మొట్ట మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు.



గౌతు శిరీష | గొండు శంకర్ | ఎం.గోవిందరావు | ఎన్.ఈశ్వరరావు

ప్రతి రౌండ్‌లోనూ టిడిపి ఆధిక్యం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గం లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ టిడిపి తన ఆధిక్యత సాధించింది. మొత్తం 22 రౌండ్ లెక్కింపులో ఒకేఒక్క రౌండ్ 13 రౌండ్‌లో వైసిపి అభ్యర్థి పిరియాకు 3,805 ఓట్లు రాగా, టిడిపి అభ్యర్థి బెందాళం అశోక్‌కు 3,500 ఓట్లు వచ్చాయి. ఈ ఒక్క రౌండ్ మినహా మిగిలిన 21 రౌండ్లలో టిడిపి ఆధిక్యత చాటుతూ దూసుకుపోయింది. మొత్తం మీద టిడిపి అభ్యర్థి అశోక్ 1,8,738 ఓట్లు, విజయకు 70,130 ఓట్లు వచ్చాయి. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లోనూ టిడిపి సత్తా చాటింది. ఇందులో 1874 ఓట్లు వచ్చాయి. వైసిపికి 699 ఓట్లు వచ్చాయి. మొట్టమొదటి సారిగా ఇచ్ఛాపురంలో భారీ మెజారిటీతో 38,608 ఓట్లు సాధించి రికార్డు సృష్టించింది. గతంలో ఎప్పుడూ ఏ పార్టీకీ ఈ స్థాయిలో మెజారిటీ రాలేదు. గెలుపొందిన ఎమ్మెల్యే అశోక్‌కు టిడిపి నాయకులు పోలింగ్ కేంద్రం వద్ద కలసి అభినందనలు తెలిపారు.



అభినందనలు తెలుపుతున్న టిడిపి కార్యకర్తలు

గౌతు శిరీషకు అభినందనలు

ప్రజాశక్తి- పలాస

స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యేగా గౌతు శిరీష గెలుపొందడంతో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు వేడుకలు నిర్వహించారు. ముందుగా గౌతు శిరీషకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఓట్లు లెక్కింపు ఒకవైపు జరుగుతుండగా, మరోవైపు టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పార్టీ కార్యాలయానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ గాలి కృష్ణారావు, సవర రాంబాబు, అంబటి కృష్ణమూర్తి, ఎం.నాని, కొండే నర్సింహులు, దడే నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



సందడి చేస్తున్న జనసేన నాయకులు

జనసేన నాయకుల సందడి

టెక్కలి : రాష్ట్రంలో జనసేన పార్టీ తరుపున పోటీ చేసిన అభ్యర్థులందరూ విజయమ సాధించడంతో పాటు పార్టీ వ్యవస్థాపకులు కొణిదెల పవన్‌కుమార్ పిఠాపురం ఎమ్మెల్యే అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. దీంతో టెక్కలి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం సంబరాలు నిర్వహించుకుని సందడి చేశారు. జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన కార్యకర్తలు మిఠాయిలు పంపిణీ చేశారు.

'నియంత పాలనకు చరమగీతం'

టెక్కలి : రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు విజయం సాధించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియంతృత్వ పాలనకి చరమగీతం పాటినట్లేనని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. దళితులపై, ఆదివాసీలపై దౌర్జన్యాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలపై దాడులు, అమరావతి రైతులపై దాడులు, వంటి నరహంతకపాలనకు చరమగీతం పాడారన్నారు. ప్రజాస్వామ్య పోరాటాలపై ఉక్కుపాదం మోపితే ప్రజా తిరుగుబాటు ఎలా ఉంటుందో అన్న దానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమన్నారు. అధికారం చేపట్టనున్న కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం దిశగా పాలన చేపట్టాలని కోరారు.

గెలుపు ప్రజలకే అంకితం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి నియోజకవర్గ శాసనసభ్యునిగా ఈ ఎన్నికల్లో 35 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాదించినా ఆనందం లేదని, తన ప్రత్యర్థి ఒక రైతు అయినా, పేదవాడైనా, బలవంతుడైనా ఆయనపై విజయం సాధిస్తే గర్వంగా ఫీలయ్యేవాడినని, కానీ, పూజకు పనికిరాని పువ్వు లాంటి ప్రత్యర్థిపై విజయం సాధించడంలో సంతృప్తి లేదని ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. గెలుపొందిన నేపథ్యంలో టెక్కలిలో మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జనసేన పార్టీ టెక్కలి ఇన్‌ఛార్జి కణితి కిరణ్ సంఘీభావంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద ఉద్వేగపూరితంగా మాట్లాడారు. తన ప్రత్యర్థి కుటుంబ వ్యవస్థను నాశనం చేశారని అన్నారు. సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకునేలా చేశారని వ్యాఖ్యానించారు. రాక్షసపాలనకు అంతం పలికి రామరాజ్యానికి ఆవకాశం ఇచ్చారని అన్నారు. టెక్కలి పట్టణంలో చాలాచోట్ల ప్రభుత్వ స్థలాలు దురాక్రమణకు గురయ్యాయని, ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగిపోవాలని కోరారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే టెక్కలిలో మొట్టమెదటి సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాలను కాపాడి వినియోగంలోకి తీసుకువస్తానని అన్నారు. గత ఐదేళ్లలో భ్రష్టుపట్టిన టెక్కలి పట్టణాన్ని జిల్లా కేంద్రం కన్నా ధీటుగా తీర్చిదిద్దుతామన్నారు. వ్యాపారస్తులు ఎవ్వరికీ భయపడకుండా ధైర్యంగా వ్యాపారాలు చేసుకోవాలని భరోసా ఇచ్చారు. టెక్కలిలో ఎవ్వరు పెత్తనం వహించినా, గూండా గిరి, దాదాగిరి చేసినా క్షమించేది లేదని హెచ్చరించారు. తనకు అండగా ఉండి విజయానికి అహర్నిశం కృషి చేసిన కార్యకర్తలకు అండగా ఉంటాయని హామీనిచ్చారు.



అచ్చెన్నాయుడుకు స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

కిక్కిరిసిన జాతీయ రహదారి

టెక్కలి నియోజకవర్గ శాసనసభ్యునిగా విజయం సాధించిన అచ్చెన్నాయుడు టెక్కలి రాక సందర్భంగా స్థానిక శ్యాంసుందరాపురం కూడలి నుంచి ర్యాలీ ప్రారంభమైంది. దారి పొడవునా పూలమాలలతో అభిమానులు సత్కరించారు. బాణసంచా పేళ్లలతో స్వాగతం పలికారు. ద్విచక్ర వాహన ర్యాలీగా సాగిన ఈ ర్యాలీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ ర్యాలీలో జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్, టెక్కలి నందిగాం, సంతబొమ్మాళి మండలాల అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, జీరు భీమారావు, లాడి శ్రీనివాసరావు, మల్లా బాలకృష్ణ, కోళ్ల లవకుమార్, రెయ్యి ప్రీతీష్‌చంద్, దల్లి ప్రసాద్‌రెడ్డి, మెండ దమయంతి, కోళ్ల కామేష్ పాల్గొన్నారు.

కర్ఫ్యూని తలపించిన టెక్కలి

టెక్కలి : సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపులో భాగంగా పోలీసులు విధించిన ఆంక్షల నేపథ్యంలో మంగళవారం టెక్కలి పట్టణంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఉదయానికే పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు పట్టణ ప్రధాన రోడ్డుపై, చిన్నచిన్న వీధుల్లోనూ తిరగడంతో ఎక్కడి ప్రజలు ఆక్కడే ఉండిపోయారు. చాలా మంది ప్రజానీకం పరిస్థితిని ఆంచనా వేసుకుని ఇళ్లల్లో టివిలకే పరిమితమయ్యారు. ప్రజల సంచారం లేకపోవడంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎక్కడో ఒకచోట దుకానాలు తెరుచుకున్నా... వినియోగదారులు లేక బోసిపోయాయి. పట్టణంలోని సినిమా హాళ్లు, రెస్టారెంట్లు, హోటళ్లు, చిన్నపాటి టిఫెన్ దుకాణాలు, దుకానాలు కూడా పోలీసుల ఆంక్షల నేపథ్యంలో మూసివేశారు. ప్రయాణికులు లేకపోవడంతో ఆర్‌టిసి కాంప్లెక్స్ బోసిపోయింది.



బోసిపోయిన ఆర్‌టిసి కాంప్లెక్స్

భారీగా పోలీసుల మోహరింపు



పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యం ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. మంగళవారం పట్టణంలో ప్రత్యేక పోలీసు బలగాలు చేరుకున్నాయి. ఫలితాలు దృష్ట్యా వర్తక వాణిజ్య వ్యాపారులూ స్వచ్ఛందంగా బంద్ పాటించారు. దీంతో ఇచ్ఛాపురంలో ఉదయం నుంచి బోసిపోయింది. అందరూ ఎన్నికల ఫలితాలపై టివిలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయారు. ఎప్పటికప్పుడు ఫలితాలు చూసుకుంటూ ఇంటి వద్దే కాలక్షేపం చేసుకున్నారు. కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యాన సిఐ ఇమ్మాన్యుల్‌రాజు, పట్టణ ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యాన పోలీసుల సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.

పోరాటం చేయాలి

టెక్కలి : రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి నాయకులు రాష్ట్ర విభజన నేపథ్యంలో బిజెపి ఇచ్చిన హామీలను అమలు చేయడానికి పోరాటం చేయాలని డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఫలితాలు వెలువడిన నేపథ్యంలో విలేకరులతో మాట్లాడారు. విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు, ప్రత్యేక రైల్వే జోన్, వంటివి సాధనలో చంద్రబాబునాయుడు కృషి చేయాలన్నారు. బిజెపికి మ్యాజిక్ ఫిగర్ ఎంపీలను ఇవ్వడంలో కూటమి బలంగా మద్దతు నిచ్చిందని అన్నారు. రాష్ట్రంలో రెండు ప్రధాన బలమైన పార్టీలు పోటీ చేస్తున్నప్పుడు కాంగ్రెస్ పార్టీ ఒంటరి అయిందని తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల విజయోత్సవాలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రాష్ట్రంలో కూటమి విజయడంకా మోగించడంతో గ్రామాల్లో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాలు నిర్వహించారు. మారుమూల గ్రామాల్లో సైతం ఎన్నికల ఫలితాల సందడి నెలకొంది. ఈ సందర్భంగా కేకులు కట్ చేసి మిఠాయిలు, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి మహిళా జిల్లా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు మండపాల సీతారాం, బిర్లంగి ఢిల్లీరావు, మడపాల భైరాగి, వంజంగి రమేష్, మడపాల శశిభూషణరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న లలితకుమారి